
ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024 5 విజయనగరం



'విజయనగరం ప్రతిష్టను ఇనుమడింపజేద్దాం'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం ప్రతిష్టను మరింత ఇనుమడింప చేసేందుకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కమిషనర్ ఛాంబర్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ మంగళవారం ఉదయం ఏడు గంటలకు అయ్యకోనేరు వద్ద భారీ మానవహారం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అయ్యకోనేరు శుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ నగరంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని, ప్రజలు భాగస్వామ్యులై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె.శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీరావు, ఎఇ మూర్తి పాల్గొన్నారు.

గుంకలాం లేఅవుట్‌లో వివిధ స్థాయిల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు



డిసెంబరు లోగా పూర్తిచేయకుంటే
ఇళ్ల బిల్లులకు చిల్లే!

ఇళ్లు లేని పేదల పరిస్థితి ముందుకు వెళ్తే గొయ్యి, వెనక్కి వెళ్తే నుయ్యి అన్న చందంగా ఉంది. ప్రభుత్వం చెల్లించిన అత్తెసరు డబ్బుతో ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారు. అలాగని ఎలాగోలా పూర్తిచేద్దామని ముందుకు వెళ్దామనుకుంటే ప్రభుత్వం ఇస్తున్న మొత్తానికి పది రెట్లు డబ్బు ఉంటే తప్ప ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి. పరిస్థితి ఇలా ఉంటే, ఈ ఏడాది డిసెంబర్‌కు నిర్మాణ పనులు పూర్తిచేసుకోలేకపోతే, ఆ తరువాత బిల్లులు వచ్చే పరిస్థితి లేదని, డిసెంబర్ 31 నాటితో కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టు పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో దశాబ్దాల తరబడి సొంతింటి కోసం ఎదురు చూస్తున్న పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది.

రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టుకోలేకపోతున్న పేదలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల స్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇళ్లు లేని సుమారు 1.30 లక్షల కుటుంబాలను అప్పట్లో గుర్తించారు. వీరందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 1830.82 ఎకరాలను అప్పటి వైసిపి ప్రభుత్వం సమీకరించింది. ఇందులో ప్రభుత్వ భూమి 1140 ఎకరాలు కాగా, ప్రయివేటు భూమి 690.82 ఎకరాల వరకు ఉంది. ప్రయివేటు భూమి సేకరణకు సుమారు రూ.300 కోట్లు ఖర్చుచేశారు. ఈ రకంగా సేకరించిన భూముల్లో 1164 లేఅవుట్లు అభివృద్ధి చేశారు. వీటిలో గుంకలాం లేవుట్ 12,301 ప్లాట్లతో రాష్ట్రంలోనే అతిపెద్దదిగా పేరు గాంచింది. లేఅవుట్ల రూపకల్పనతోపాటు బోర్లు, రక్షిత తాగునీటి ట్యాంకులు, రహదారుల నిర్మాణం, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కూడా రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్టు ప్రభుత్వ లెక్కలు చూపుతున్నాయి. ఇంటి నిర్మాణానికి ప్రతి లబ్ధిదారుడికీ రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తామని ప్రకటించారు. లబ్ధిదారులు తామే సొంతంగా నిర్మించుకుంటే వారికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తామని, లేదంటే ఇంటి నిర్మాణ సామగ్రి రూపంలో ప్రభుత్వ సహాయం కోరుకుంటే ఆ విధంగా సామగ్రి అందజేస్తామని తెలిపారు. ఈ పనులూ చేసుకోలేని వారికి ఏకంగా ఇళ్లు నిర్మించి, ఇంటిముందు ముగ్గు వేసి తాళం చెవి అప్పగిస్తామని కూడా అప్పటి జగన్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. అయితే, ఆచరణలో లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరగలేదు. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం.


పెరిగిన ఇనుము, సిమెంట్, ఇటుకలు తదితర గృహ నిర్మాణ వస్తు సామగ్రి వల్ల ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80 లక్షలతో చాలామంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేకపోయారు. విజయనగరం జిల్లాలో మంజూరైన 78,805 ఇళ్లకు గాను పూర్తి స్థాయిలో నిర్మించినవి కేవలం 43,192 మాత్రమే. పునాదులు పూర్తికాకుండానే 10,392 ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇందులో 2,340 ఇళ్లకు మాత్రమే రూ.5 వేల చొప్పున బిల్లులు చేశారు. 8051 ఇళ్లకు ఇప్పటికీ చెల్లింపులు లేవు. పునాదుల స్థాయిలో 10,444, లింటల్ లెవెల్‌లో 1,361 ఉండిపోయాయి. స్లాబ్ లెవెల్ గోడలతో 2,873, నిర్మాణాలు పూర్తయినవి 1820 ఉన్నాయి. 2,980 ఇళ్ల పనులు ఇంకా ప్రారంభానికి కూడా నోచుకోలేదు. చేపట్టిన మొత్తం ఇళ్లన్నింటికీ కలిపి ఇప్పటి వరకు రూ.879.50 కోట్ల మేర బిల్లులు చెల్లించినట్టు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పూర్తయిన వాటికన్నా వివిధ దశల్లో నిలిచిపోయినవే అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ సాయంతో కట్టుకుందామనుకున్నవారు ముందుకు సాగలేకపోయారు. పూర్తిగా ప్రభుత్వ నిర్మాణాలపై ఆధారపడినవారు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. ప్రభుత్వ సాయం సరిపోక కొంతమంది నిర్మాణం చేపట్టలేకపోగా, కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు మధ్యలో నిలిపేయడంతో మిగిలినవారు నష్టపోతున్నారు. మరోవైపు ఈ ఏడాది డిసెంబర్‌లోపు నిర్మించుకోకపోతే ప్రభుత్వం నుంచి ఆ కొద్దిపాటి బిల్లులు కూడా వచ్చే పరిస్థితి లేదని అధికారులు చెబుతుండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది.

నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నాం. మాకు ఎదురౌతున్న సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఇళ్లకు సంబంధించిన ప్రాజెక్టు పూర్తికానున్న నేపథ్యంలో నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తగిన ఆదేశాలు జారీచేసింది.

- వి.శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ అధికారి, విజయనగరం జిల్లా

వర్షాలు ఆగాయి.. వరదలు తగ్గాయి.. కూరగాయలు ధరలు పైపైకి పెరుగుతున్నాయి. వరద నష్టం కూరగాయలపై పడటంతో జిల్లాలో వాటి ధరలు కొండెక్కాయి. దీంతో సామాన్యుడికి కష్టాలు మొదలయ్యాయి. భారీ వర్షాల కారణంగా చాలా చోట్ల పంట నష్టపోవడంతో దిగుబడి తగ్గింది. దీంతో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు అర్ధసెంచరీ దాటేశాయి. ఆగాకర, పందిరి చిక్కుడు అయితే సెంచరీ కొట్టేశాయి. ఈ సీజన్‌లో అందరికీ అందుబాటులో ఉండే కూరగాయాల ధరలు.. ముందుందు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు వంట నూనెల ధరల పెంపుతో ప్రజలపై భారీగా భారం పడింది.



వంటింట్లో ధరల మంట

- పెరిగిన నూనె ధరలు
- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- ఘాటు ఎక్కుతున్న ఉల్లి
- సెంచరీ కొట్టిన ఆగాకర, పందిరి చిక్కుడు

ప్రజాశక్తి-విజయనగరం కోట

పెరుగుతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఏ వస్తువు టచ్ చేసినా భగ్గుమంటున్న ధరలతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పప్పు నుంచి ఉప్పు వరకు, కరివేపాకు నుంచి కాకరకాయ వరకు, చికెన్ నుంచి అల్లం, వెల్లుల్లి వరకు ఏది చూసినా అధిక ధరలు ఉన్నాయి. గత పది రోజులుగా పెరుగుతున్న ధరలతో మార్కెట్ ధరల బోర్డులో రేట్లు సాధారణం కంటే రెట్టింపునకు చేరుకున్నాయి. వంట నూనెల ధరలు ఒక్కసారిగా వినియోగదారులను కుదుపునకు గురిచేశాయి. నూనె గింజల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచడంతో లీటరు నూనెపై రూ.15 నుంచి 20 వరకు పెరిగింది. 15 లీటర్ల డబ్బాపై రూ.300 వరకు భారం పడింది. నూనె ధరల ప్రభావం తినుబండారాలపై పడింది. స్వీట్లు, ఇతర తినుబండారాల ధరలు పెరిగాయి.

వరదల దెబ్బ

వరుస తుపాన్లతో పంట నష్టం వల్ల దిగుబడి తగ్గి కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఉల్లి లేని కూర ఉండదు. అటువంటి ఉల్లి ధర రోజురోజుకు పెరుగుతూ పోతోంది. సోమవారం రైతుబజార్లలో ఉల్లి కిలో రూ.55కు చేరింది. దీంతో ప్రజలు రానున్న రోజుల్లో ఇంకా ఎంత పెరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆగాకర కిలో రూ.120, పందిరి చిక్కుడు కిలో రూ.100 మార్కును అందుకున్నాయి. కిలో వంకాయలు రూ.53, టమాటా 42, బెండకాయలు రూ.36, కాకరకాయలు రూ.40, బీరకాయలు రూ.48, పొడుగు చిక్కుడు రూ.40, మునగకాడలు రూ.60, కేప్సికం రూ.80, కందదుంపలు రూ.60, పచ్చిమిర్చి రూ.55, అల్లం 130, వెల్లుల్లి రూ.290, ఫ్రెంచ్‌బీన్స్ రూ.80కు చేరాయి. దీంతో కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుక్కోవాలంటేనే సామాన్యులు భయపడుతున్నారు. ప్రభుత్వం కలుగజేసుకొని సబ్సిడీలో అందిస్తే బాగుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

పోరాట యోధుడు ఏచూరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కామ్రేడ్ సీతారాం ఏచూరి పోరాట యోధుడని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి రమణమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పక్షాన ఏచూరి ప్రజా ఉద్యమాలు నిర్వహించి, మహిళలకు, పేదలకు అండగా నిలబడ్డారని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం పార్లమెంట్‌లో తన గళం విప్పారన్నారు. మహిళా హక్కుల రక్షణకు అనేక ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సుజాత, డి.సత్యవతి, దేవి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికరాజ్య స్థాపనకు కృషి

కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా కామ్రేడ్ సీతారాం ఏచూరి జీవించారని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. డాబాతోటలో ముఠాకళాసీల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా రెడ్డి శంకరరావు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల మార్పుకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఏచూరి గళం విప్పారని, కార్మిక హక్కుల రక్షణకు అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, మేస్త్రీ టి.రమణ, శ్రీను, గోవింద్, కార్మికులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ

రవాణా సౌకర్యంతోనే అభివృద్ధి

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన ఎంపి కలిశెట్టి



వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రవాణా సౌకర్యాలుండే ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. సోమవారం విజయనగరం రైల్వేస్టేషన్‌లో విశాఖ-దుర్గ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లాకు చెందిన బొబ్బిలిలో కూడా వందేభారత్‌కు హాల్టింగ్ ఉండేలా చూడాలని ఎంపిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం నుంచి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కె.రామ్మోహన్ నాయుడు, విజయనగరం చేరుకున్నారు. విజయనగరం నుంచి ఎంపి కలిశెట్టి కుటుంబ సభ్యులతో కలిసి రాయగడ వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. చిన్నారి రోహిత నృత్య ప్రదర్శన ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, డిఎంఇ ఎన్‌వి రమణ, స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణ, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాలాజీరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

సగంలో వదిలేసిన విమానాశ్రయానికి వెళ్లే వంతెన



మండలంలో జాతీయ రహదారిపై ఉప్పాడపేట కూడలి వద్ద విమానాశ్రయానికి వెళ్లేందుకు చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని మధ్యలో వదిలేశారు. తక్కువ ఎత్తులో నిర్మించడంతో భారీ వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. వంతెన పక్కన ఉన్న జీడితోటలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణం పూర్తయితే పైనుంచి వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంది. కాని ఇంతవరకు ఇటు విమానాశ్రయ అధికారులు, అటు హైవే అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు అంటున్నారు.

వంతెన.. వేదన

- హైవేపై విమానాశ్రయానికి వెళ్లే ట్రంపెట్ వంతెన నిర్మాణంలో జాప్యం
- తక్కువ ఎత్తులో నిర్మించడంతో వెళ్లలేకపోతున్న భారీ వాహనాలు
- వంతెన సమీపంలో పూర్తికాని భూసేకరణ
- ఐదేళ్ల కిందట ఫ్లైఓవర్ నిర్మించి వదిలేసిన అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం

అటు విశాఖపట్నం, విజయనగరం, ఇటు శ్రీకాకుళం నుంచి వచ్చే వారు భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేందుకు ఉప్పాడపేట కూడలి వద్ద జాతీయరహదారిపై ఐదేళ్ల క్రితం వంతెన నిర్మాణం ప్రారంభించారు. దీనికి ట్రంపెట్ అనే పేరు పెట్టారు. విశాఖలోని ఎన్ఎడి వంతెనలా నిర్మాణం చేపట్టనున్నారు. అందుకు హైవే ఆరు లైన్ల విస్తరణ జరిగిన సమయంలో సుమారు ఐదేళ్ల కిందట సగం నిర్మించి వదిలేశారు. అప్పట్లో అధికారులు ఇచ్చిన డిజైన్ ప్రకారం జాతీయరహదారి అధికారులు నిర్మాణం చేపట్టారు. వంతెన ఎత్తు ప్రస్తుతం తక్కువగా ఉండటంతో ఎత్తుగా ఉన్న భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. పక్కనే ఉన్న జీడితోటలో నుంచి వెళ్లి మళ్లీ జాతీయరహదారిపైకి రావల్సిన పరిస్థితి నెలకొంది. కాని జాతీయ రహదారిపై నిర్మించిన కాలువపై ఉన్న పలకల మీది నుంచి లారీలు వెళ్లడంతో అవి పగిలిపోతున్నాయి. అంతేకాక లారీలు కూడా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వాహనదారులే సమీపంలోని జెసిబిని తెప్పించి కాలువలో మట్టిని పూడ్చి దానిపై నుంచి వెళ్తున్నారు. తరువాత ఆ మట్టిని కాలువలో నుంచి తొలగిస్తున్నారు.

భారీ వాహనాలకు ఇబ్బందులు

ఇతర ప్రాంతాల నుంచి వివిధ కంపెనీలకు డిజైన్ చేసిన యంత్రాలను లారీల్లో తరలిస్తుంటారు. మామూలు లారీల్లో కాకుండా సుమారు 50 నుంచి 80 టైర్లు కలిగిన పెద్ద ట్రాలీ లారీల్లో వీటిని తరలిస్తుంటారు. ఈ మిషన్లు ఎక్కువ ఎత్తు కలిగి, వెడల్పుగా ఉంటాయి. విద్యుత్తు ప్రమాదాలు కలగకుండా తక్కువ వేగంతో వెళుతుంటాయి. సుమారు పది మంది సిబ్బంది వెనుక కూర్చొంటారు. ఇలాంటి వాహనాలకు ఇక్కడ చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రాత్రి వేళ వస్తే ఇక్కడ ఉండిపోయి మళ్లీ ఉదయాన్నే తరలించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇటీవల జాతీయరహదారి అధికారులు కాలువపై బలమైన పలకలను ఏర్పాటు చేశారు. ఎంత భారీ వాహనమైన ఈ కాలువపై నుంచి వెళ్లిపోయే విధంగా ఏర్పాట్లు చేయడం విశేషం. విమానాశ్రయ వంతెన పూర్తయితే ఇలాంటి పెద్ద వాహనాలు వంతెన పైనుంచి వెళ్తాయని అధికారులు అంటున్నారు. కాని ఈ వంతెన ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వంతెన సమీపంలో భూసేకరణ కూడా ఇప్పటికీ చేస్తుండడంతో చాలా సమయం పడుతుందని అధికారులు చెబుతుండటం గమనార్హం.



భారీ వాహనాలు వెళ్లేందుకు కాలువపై వేసిన బలమైన పలకలు

పవర్ లిఫ్టింగ్‌లో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 13, 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్స్ ట్రోఫీలో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. ఈ పోటీల్లో ఎస్.రామకృష్ణ 74 కిలోల విభాగంలో బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. 69 కిలోల విభాగంలో ఎ.రాజా బంగారు, కాంస్య పతకాలు, 59 కిలోల విభాగంలో కె.జగదీష్ బంగారు, కాంస్య పతకాలు సాధించారు. మాస్టర్స్-1 కేటగిరీలో ఎం.గోపీకృష్ణ వెండి, కాంస్య పతకాలు, ఉమెన్స్ 69 కిలోల విభాగంలో జారా సిద్దిక్ బంగారు, వెండి పతకాలు సాధించారు. కోడి రామ్మూర్తి వ్యాయామశాలలో పి.లక్ష్మీనారాయణమూర్తి వద్ద వీరంతా శిక్షణ తీసుకున్నారు.



సాధించిన పతకాలతో క్రీడాకారులు

ఈద్ మిలాద్ ఉన్ నబీ..
మతసామరస్యానికి ప్రతీక

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సోమవారం నిర్వహించిన ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగ మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలో, ఇతర ప్రాంతాల్లో ముస్లిం సోదరులు చేపట్టిన ర్యాలీలు ప్రశాంతంగా ముగిశాయి. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా ఆయన్ను స్మరించుకొంటూ ముస్లిం సోదరులు ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను భక్తి, శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మసీదుల వద్ద ముందుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలోని అబాదవీధి నుండి ప్రారంభమైన భారీ ర్యాలీ కోట జంక్షన్, సింహాచలం మేడ, బాలాజీ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషను రోడ్డు, కన్యకా పరమేశ్వరి టెంపుల్, గంట స్థంభం, పైడితల్లమ్మ టెంపుల్, మూడు లాంతర్లు మీదుగా తిరిగి అబాదవీధికి చేరింది.

వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్, టుటౌన్ సిఐ టి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్‌ఐలు ప్రసన్న కుమార్, నరేష్, హరిబాబు నాయుడు, సుదర్శనరావు, సూర్య కుమారి, దుర్గాప్రసాద్, వీర జనార్దన్, చిన్నారావు, లోవరాజు, శంబంగి రవి, ఎ.మహేశ్వర రాజు, సిబ్బంది పాల్గొని, బందోబస్తు నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

ఉత్సాహంగా ఆటలు పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో క్రికెట్, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, పరుగు పోటీలు నిర్వహించారు. పోటీలను యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు ప్రారంభించారు. పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్‌లో నెల్లిమర్ల నియోజకవర్గం విజేతగా, బొబ్బిలి రన్నర్‌గా నిలిచాయి. క్రికెట్‌లో చీపురుపల్లి, గజపతినగరం, వాలీబాల్‌లో రాజాం, గజపతినగరం విజేతలుగా, రన్నర్‌గా నిలిచాయి. విజేతలు రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో యుటిఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, యుటిఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

స్వచ్ఛత వైపు అడుగులు

● సూపర్ శానిటేషన్ డ్రైవ్‌తో గ్రామాలు శుభ్రం ● ఈనెల 6 నుంచి జిల్లాలో 775 పంచాయతీల్లో పనులు ప్రారంభం ● 15వ ఆర్థిక సంఘం నిధులతో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - విజయనగరం కోట

జిల్లాలోని పలు గ్రామాలు స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాయి. సూపర్ శానిటేషన్ డ్రైవ్ పేరిట గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ రాజ్ శాఖ ముమ్మరంగా చేపడుతుంది. ఇందులో భాగంగా కొన్ని గ్రామాల్లో కాలువల్లో పూడికతీత పనులు.. మరి కొన్ని గ్రామాల్లో చెత్తకుప్పలు తొలగింపు.. ఇంకొన్ని గ్రామాల్లో పెరిగిన పొదలు, గ్రామం మధ్యలో నిల్వ నీరు తొలగింపు.. మరోచోట పైపులైన్ల లీకేజీ నివారణ చర్యలు.. ఇంకో చోట తాగునీటి వనరుల క్లోరినేషన్.. ఇలా జిల్లాలో ఏ పల్లె చూసినా ఏదో ఒక కార్యక్రమాన్ని చేపట్టి పల్లెలను స్వచ్ఛత దిశగా అడుగులు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈమధ్య కాలంలో భారీవర్షాలు కురిసి గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య పరిస్థితులు క్షీణించి తద్వారా తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంటుందని గుర్తించిన పంచాయతీ రాజ్ శాఖ అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఇటీవల జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. దీంతో జిల్లాలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసిన కలెక్టర్ పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా చేసి పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో ఈనెల తొలి వారంలో భారీవర్షాలు కురిసిన నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా నివారించే లక్ష్యంతో గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పంచాయతీరాజ్ శాఖను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన పంచాయతీరాజ్ శాఖ సెప్టెంబర్ 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలోని 775 గ్రామ పంచాయతీల్లో సూపర్ శానిటేషన్ డ్రైవ్ ప్రత్యేక పారిశుధ్య ఉద్యమంలా శ్రీకారం చుట్టింది. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఈ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి.

గ్రామాల్లో మురికి కాల్వల్లో పూడికలు తీసివేయడం ద్వారా మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పనులు చేపడుతున్నారు. గ్రామం మధ్యలో పల్లపు ప్రదేశాల్లో వర్షపు నీరు, ఇళ్లలో వినియోగించిన నీరు నిల్వ వుండకుండా తొలగించే పనులు చేపడుతున్నారు. తద్వారా గ్రామాల్లో దోమల వ్యాప్తికి ఆస్కారం లేకుండా చూస్తున్నారు. గ్రామాల మధ్యలో చెత్తకుప్పలు వుంటే వాటిని తొలగించే కార్యక్రమాలు కూడా ముమ్మరంగా చేస్తున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ చల్లి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త పనులు చేస్తున్నారు. వీటితోపాటు గ్రామం మధ్యలో గుబురుగా పొదలు పెరిగిన చోట వాటిని తొలగించే పనులు చేస్తున్నారు.

తాగునీరు కలుషితం కాకుండా..

మరోవైపు గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా కార్యక్రమాలు చేస్తున్నారు. తాగునీటి పైపులైన్లలో లీకేజీలను గుర్తించి వాటిని సరిదిద్దడం, తాగునీటి వనరులు కలుషితం కాకుండా తాగునీటి సరఫరా ట్యాంకుల్లో నీరు నింపే ప్రతి సారి క్లోరినేషన్ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవడం, ప్రతిరోజు తాగునీటి నాణ్యతను నీటిని సరఫరాచేసే ప్రదేశం వద్ద, ట్యాంకు వద్ద నమూనాలను తీసి పరీక్షించడం వంటి కార్యక్రమాలన్నీ ప్రతినిత్యం చేపడుతున్నారు.

ఒక్క ఫిర్యాదూ రాలేదు.

జిల్లాలో ఇటీవలి కాలంలో కొన్ని రోజులపాటు భారీవర్షాలు కురిసినప్పటికీ వ్యాధులకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులూ ఏప్రాంతం నుంచీ రాలేదు. జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యల వల్ల ఫలితాలు వస్తున్నాయనేందుకు ఇదే తార్కాణం. రానున్న రోజుల్లోనూ ఇదే పరిస్థితిని కొనసాగించాలని, పారిశుధ్య పరిస్థితులు నియంత్రణలోనే వుండేలా చూడాలని జిల్లా యంత్రాంగం పట్టుదలతో వుంది. ఆ దిశగా చర్యలు చేపడుతోంది.



జెసిబితో గ్రామం ముందు భాగంలో శుభ్రం చేస్తున్న సిబ్బంది



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కూలీలు

అందుబాటులో 15వ ఆర్థిక సంఘం నిధులు

ప్రతి గ్రామంలోనూ పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన 15వ ఆర్థికసంఘం నిధులు అన్ని గ్రామ పంచాయతీల్లోనూ అందుబాటులో ఉన్నాయి. వీటితోనే పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ఈ పనులు చేపట్టేందుకు వీలుగా అవసరమైన బ్లీచింగ్ పౌడర్, ఇతర శానిటేషన్ మెటీరియల్‌ను కొనుగోలు చేసి అన్ని పంచాయతీల్లో సిద్ధం చేశాం. పారిశుధ్య పనులు చేపట్టే నిమిత్తం అన్ని పంచాయతీల్లో రోజువారీ వర్కర్లను ఏర్పాటు చేసుకొని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వర్షాకాలం పొడవునా జిల్లాలో అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు కొనసాగిస్తాం. పారిశుధ్య పనులపై పర్యవేక్షణ కోసం జిల్లా పంచాయతీ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశాం.

శ్రీధర్ రాజా, జిల్లా పంచాయతీ అధికారి, విజయనగరం

'వందే భారత్'కు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

దుర్గ్ నుంచి విశాఖపట్నానికి నూతనంగా నడుస్తున్న వందే భారత్ రైలుకు బొబ్బిలిలో హాల్ట్ కల్పించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడును ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. కేంద్రమంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం రామ్మోహన్‌నాయుడును బేబీనాయన కలిసి వినతిపత్రం అందజేశారు. బొబ్బిలి రైల్వే స్టేషన్ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుందని, రైల్వేకు ఆదాయం వస్తుందని చెప్పారు. నిత్యం రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్‌లో వందే భారత్ రైలుకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తితో ఉన్నారని, హాల్ట్ కల్పించేలా చూడాలని కోరారు. రైల్వే శాఖ మంత్రి, అధికారులతో మాట్లాడి హాల్ట్ కల్పించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో టిడిపి నాయకులు ఎస్.ఈశ్వరరావు, ప్రసాద్, నాయకులు ఉన్నారు.



కేంద్రమంత్రికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే



జెసి రాజుకు అవార్డు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ క్లబ్ ఉత్తమ అధ్యక్షులుగా జెసి రాజు

ప్రజాశక్తి - బొబ్బిలి

రోటరీ క్లబ్ ఉత్తమ అధ్యక్షులుగా జెసి రాజు అవార్డు అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేటలో సోమవారం జరిగిన సమావేశంలో అవార్డును రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ అంతర్జాతీయ సమన్వయకర్త మాంక్ రవి, పూర్వ గవర్నర్ రామారావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు చేసి ప్రజలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. నిస్వార్థంతో సమాజానికి సేవలు అందించాలని కోరారు. అవార్డు గ్రహీత రాజు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నుంచి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు మరింత బాధ్యతలు పెంచిందని చెప్పారు. రాజును క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, తూముల కార్తీక్, చంద్రకిశోర్, గెంబలి అరిను, వి.శ్రీహరి అభినందించారు.

ఎయిడ్స్ రోగుల పట్ల వివక్షత చూపొద్దు

ప్రజాశక్తి - బొబ్బిలి

హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపవద్దని వైడిఒ ఆర్‌డబ్ల్యు కె.ఉమా అన్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన బాలుర కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు నివారణకు కండోమ్ వాడాలని కోరారు. హెచ్ఐవి, ఎయిడ్స్ రోగులు పట్ల వివక్షత చూపకుండా కలిసిమెలిసి ఉండాలని కోరారు. హెచ్ఐవి, ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని చెప్పారు. కార్యక్రమంలో పిఇ ఈశ్వరరావు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగించండి

ప్రజాశక్తి - రాజాం

రాజాం మున్సిపాలిటీ పరిధిలో గల నరసింహనాయుడు కాలనీ 5వ వార్డు వద్ద ఉన్న రాజాం ప్రధాన కాలువ చెత్తతో పూడుకుపోతుంది. మురుగు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో నరసింహనాయుడు కాలనీలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ చెత్తను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన చెత్త

నీట్ పీజీ ఫలితాల్లో సందీప్ ప్రతిభ

ప్రజాశక్తి - బొబ్బిలి

నీట్ పిజి ఫలితాల్లో పట్టణానికి చెందిన శంబంగి సందీప్ వర్ధన్ ఓపెన్ కేటగిరీలో 5829, ఆలిండియా ఒబిసి కేటగిరీలో 1603, స్టేట్ ర్యాంక్ 273 సాధించి ప్రతిభ కనబరిచాడు. ఆంధ్ర వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశాడు. తాను ఎండి జనరల్ మెడిసిన్ పూర్తి చేయాలని ఆసక్తి ఉన్నట్లు సందీప్ చెప్పారు. కుమారుడు మంచి ర్యాంక్ సాధించడంతో తండ్రి శంబంగి వెంకటనాయుడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కూలేందుకు సిద్ధంగా వ్యవసాయ కేంద్రం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రైతుల సౌకర్యార్థం నిర్మించిన మండల వ్యవసాయ కేంద్రం కూలేందుకు సిద్ధమైంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించడంతో మండల వ్యవసాయ కేంద్రాన్ని పట్టించుకోలేదు. దీంతో ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరి విధులు కూడా నిర్వహించడానికి వీలు లేకుండా కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో మండల వ్యవసాయాధికారి పరాయి పంచనే విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మండల కేంద్రంలో గల వ్యవసాయ కేంద్రానికి నిధులు మంజూరు చేసి రైతుల ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా నూతన భవనాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వ్యవసాయ కేంద్రం

పార్లమెంట్ ఆమోదం లేకుండా వర్గీకరణ చెల్లదు

ప్రజాశక్తి - శృంగవరపు కోట

పార్లమెంట్ ఆమోదం లేకుండా ఎస్‌సి వర్గీకరణ చెల్లదని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమిక్షించాలని జిల్లా దళిత నాయకులు ఆతవ ఉదయ భాస్కర్, డోల కేశవ అన్నారు. సోమవారం ధర్మవరం గ్రామంలో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా జరిగిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 341కు విరుద్ధంగా పార్లమెంట్ ఆమోదం లేకుండా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెల్లదని వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు బండ అప్పన్న, రాజు, లోతేటి చెల్లయ్య, అప్పారావు, కొట్టాం నాయకులు గుర్రపు శ్రీను, కోటరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపులో ఉద్యోగుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

కూటమి ప్రభుత్వం గెలుపునకు ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం లక్కవరపుకోట మండల కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో గిరిజన ఉద్యోగ ఉపాధ్యాయలందరు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉద్యోగస్థులందరూ కలిసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, మీకు ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని ఆమె అన్నారు అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, రాయవరపు చంద్రశేఖర్, జి.ఎస్ నాయుడు, కాపుగంటి వాసు, ఇందుకూరి శ్రీనురాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్క కిరణ్, పొట్నూరు అప్పలరాజు, పెదగడ రాజు, గుడుపు బ్రహ్మాజీ, బోనంగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఎస్ సుబ్బలక్ష్మి జయంతి

ప్రజాశక్తి - విజయనగరం కోట

కొత్తగ్రహారంలో రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీలో సోమవారం ఎం.ఎస్.సుబ్బలక్ష్మి 108వ జయంతి ఘనంగా నిర్వహించారు. రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, కోశాధికారి గుండ వీరభద్ర రావు, ప్రిన్సిపల్ డాక్టర్ మండపాక రవి, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ రవి మాట్లాడుతూ ఎం.ఎస్.సుబ్బలక్ష్మి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, వంశీకృష్ణ, శారద, భానుహర్ష, మహేశ్వరరావు, బాలాజిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో కోర్టు భవనానికి అనుమతులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

రెండు నెలల్లో చీపురుపల్లి మెజిస్ట్రేట్ కోర్టు భవనం, జడ్జి నివాస భవన నిర్మాణానికి అనుమతులు తీసుకు వస్తానని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. స్థానిక మెజిస్ట్రేట్ కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని ఆయన స్థానిక టిడిపి, జనసేన నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్వకేట్స్ అర్ రమేష్ నాయుడు, ఆర్ నాగభూషణరావు, మండల సూర్యనారాయణ, డి రఘుపతి నాయుడులు కోర్టు భవన పరిస్థితులను కళావెంకటరావుకి వివరించారు. గతంలో కోర్టు భవన నిర్మాణానికి రూ.3.80 కోట్ల మంజూరయ్యాయని అయితే అప్పటిలో నిర్మాణ అనుమతులు రాలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.4.60 కోట్ల వ్యయంతో మరొక ప్రతిపాదన పంపామన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుండి అనుమతులు ఇప్పించ వలసిందిగా అడ్వకేట్స్ ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి రెండు నెలల్లో నిర్మాణ అనుమతులు తీసుకు వస్తానని హామీ ఇచ్చారు. కళావెంకటరావు వెంట టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, ఇతర టిడిపి నాయకుల, జనసేన నాయకులు, అడ్వకేట్స్ కొణిసి త్రినాధరావు, మెహరాప్రసాద్, మీసాల లక్ష్మణరావు పాల్గొన్నారు.



కోర్టు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే లలిత కుమారి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెంనాయుడుని విశాఖపట్నంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే లలిత కుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాం ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నియోజకవర్గంలో రైతుల సమస్యలు, రైతు బజార్, పశువుల షెడ్ల నిర్మాణాల గురించి, కొత్తవలస పట్టణ కేంద్రంలో గల మార్కెట్ యార్డ్ నూతన భవన నిర్మాణం కోసం, ఇతర వ్యవసాయ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నియోజకవర్గ సమస్యలు పట్ల సానుకూలంగా స్పందించారన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కరెడ్ల ఈశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే కోళ్ల దంపతులు



బట్టలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని చినమోసూరు వలస గ్రామంలో సోమవారం బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ళ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ట్రెజరర్ వి.ఎన్ శర్మ పర్యవేక్షణలో గిరిజన పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు చీరలు, బట్టలు, నిత్యావసరాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మాజీ సైనికుడు ఎం ధర్మారావు మానవతా దృక్పథంతో గర్భిణులకు రూ.1116 నగదుతో పాటు ఒక చీర, బొంతను అందించారు. ఈ సందర్భంగా వనమిత్ర కృష్ణదాస్ మాట్లాడుతూ బొబ్బిలి శివారు గిరిజన ప్రాంతాలైన ఎరకందరవలస, మైసూరవలస గ్రామాల్లో కడు నిరుపేదలు ఉన్నారని, సామాజిక వేత్తలు స్పందించి విరివిగా విరాళాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లలు మహిళలు వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం పట్ల అవగాహన

ప్రజాశక్తి - చీపురుపల్లి

రానున్న రోజుల్లో అన్ని గ్రామాల్లో యువత సహకారంతో అవయవదానం పట్ల అవగాహన కలిగిస్తామని చీపురుపల్లికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బివి గోవిందరాజులు తెలిపారు. మండలంలోని మెట్టపల్లి గ్రామంలో సోమవారం అవయవదానం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గోవింద రాజులు మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న యువతతో ప్రజలందరికీ అవగాహన కలిగిస్తామన్నారు. అవయవదాన విషయంలో మానవీయత సంస్థంకు అండగా ఉంటామని యువత ప్రతిజ్ఞ చేశారు. ఆపత్కాలంలో డబ్బులు ఇచ్చినా కొనలేనివి అవయ వాలేనని, వీటిని పొందాలంటే మరణానంతరం అవయవ దానం ఒక్కటే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు

ప్రజాశక్తి - బాడంగి

మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పిలుపు మేరకు వరద బాధితుల కోసం మండలంలోని ఆకులకట్ట గ్రామస్తులు పెద్దలు కలిసి రూ.37వేలు విరాళంగా అందజేశారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయనని కలిసి సోమవారం కోటలో డబ్బులు అందించారు. ఎమ్మెల్యే గ్రామస్తులని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ, రావిపల్లి అప్పలనాయుడు, సింహాచలం, బేత తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: సిఎం సహాయ నిధికి తెర్లాం మండలం పెరుమాళి టిడిపి నాయకులు రూ.95,555, అరసబలగ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రూ.20వేలు, గోపాలవలస నాయకులు రూ.20వేలు, మోదుగు వలసకు చెందిన జగన్ రూ.10వేలు, మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన తెలుగు మహిళలు, జనసేన వీర మహిళలు కలిసి రూ.66,666, మాజీ కౌన్సిలర్ రెడ్డి ప్రసాద్ తమ తల్లిదండ్రులు జ్ఞాపకార్థంగా రూ.30వేలు, నోబుల్ స్కూల్ కరస్పాండెంట్ రంభ వేణుగోపాలరావు రూ.10వేలు, సాగర్, జగదీష్ కలిసి రూ.10వేలు విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు. విరా ళాలు ఇచ్చిన వారందరికీ బేబినాయన కృతజ్ఞతలు తెలిపారు.



బేబినాయనకు విరాళం అందిస్తున్న ఆకుల కట్ట గ్రామస్తులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - సంతకవిటి

కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, కార్మిక పక్షపాతి సీతారాం ఏచూరికి స్థానిక భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు మండాకురిటిలో సోమవారం ఘన నివాళి అర్పించారు. ఆ యూనియన్ అధ్యక్షులు అసిరప్పడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.విశ్వనాధ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి. శంకర్రావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టమన్నారు. ఆయన పార్లమెంట్‌లో కార్మికవర్గం కోసం వాళ్ళ హక్కుల కోసం ప్రభుత్వాన్ని నిలదీసేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రాజాం: రైస్ మిల్లు కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. ఆ యూనియన్ అధ్యక్షులు పోరెడ్డి విశ్వనాథం, కార్యదర్శి కంచినాయుడు, కార్మికులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి. శంకర్రావు పాల్గొని మాట్లాడారు. ఏచూరి విద్యార్థి సంఘానికి నాయకత్వం వహించి విద్యార్థుల హక్కుల కోసం పోరాడేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మిల్లు కార్మికులు పాల్గొన్నారు.



ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గ్లకోమాపై భయపడాల్సిన అవసరం లేదు

ప్రజాశక్తి - బొబ్బిలి

గ్లకమో కంటి వ్యాధిపై భయపడాల్సిన అవసరం లేదని కంటి వైద్య నిపుణులు కెవి అప్పారావు అన్నారు. తన నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్లకమో కంటి వ్యాధికి శస్త్ర చికిత్స చేస్తున్నామని చెప్పారు. బొబ్బిలిలో గ్లకమో శస్త్ర చికిత్సలు చేయడంతో ఈనెల 13,14,15న తిరుపతిలో జరిగిన అఫ్తాలమిక్ అసోసియేషన్ నిర్వహించిన మూడు రోజులు కాన్ఫరెన్స్‌లో తనను అభినందించారని చెప్పారు. గ్లకమో వ్యాధికి 1961లో సుజర్ అనే వైద్యులు కనిపెట్టారని 1970 నుంచి శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని చెప్పారు. గ్లకమో శస్త్ర చికిత్సలో 60 నుంచి 98శాతం సక్సెస్ రేటు వచ్చిందన్నారు. గ్లకమో వ్యాధికి మంచి మందులు వచ్చాయని చెప్పారు. ఉత్తరాంధ్రలో ఆర్థిక ఇబ్బందులు వల్ల గ్లకమో వ్యాధికి చికిత్స తీసుకునేందుకు చాలామంది ముందుకు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు దగ్గర చికిత్స తీసుకుంటే గ్లకమో వ్యాధిని తగ్గించుకుని మంచి చూపు పొందవచ్చునన్నారు. మధుమేహం, గుండె జబ్బులు, బిపి వల్ల కూడా గ్లకమో వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కంటి చూపు మందగించడం, కల్లు ఎర్ర బడడం, కంటి నొప్పి వంటి లక్షణాలు ఉంటే గ్లకమో వ్యాధి వచ్చినట్లేనని చెప్పారు. బొబ్బిలిలో 35ఏళ్లలో 6వేల మందికి పైగా గ్లకమో శస్త్ర చికిత్సలు చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లలు నుంచి వృద్ధుల వరకు గ్లకమో వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. 40ఏళ్లు దాటిన వారిలో 3శాతం మంది వరకు గ్లకమో వ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గ్లకమో, కంటి వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆస్ట్రేలియాలోని మోనాష్ విశ్వవిద్యాలయ రూరల్ హెల్త్ హెడ్ ప్రొఫెసర్ మార్ట్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయంలోని ల్యాబ్స్ పరిశీలించారు. ఆప్టొమెట్రీ, రేడియాలజీ, అనాటమీ, ఇ-ఆటోల తయారీ, జైరో ప్లేన్, ఎఆర్‌విఆర్ ల్యాబ్, కంప్యూటర్ న్యూమరికలో యూనిట్, కుట్టు యంత్రాల యూనిట్, టిష్యూ కల్చర్ ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విత్తనం వంటి వారని వారి ఆకాంక్షలు నెరవేరాలంటే చెట్టు మాదిరిగా ఎదగాలన్నారు. అనంతరం వివిధ అంశాలపై ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.ఎన్.రావుతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం భువనేశ్వర్ క్యాంపస్ నుంచి స్కూల్ ఆఫ్ పారామెడిక్స్ అండ్ అల్లీడ్ హెల్త్ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ కుమార్ ఝా, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ఇన్చార్జి డీన్ డాక్టర్ విజయ్ బాబు, ఆప్టొమెట్రీ హెడ్ సౌరజిత్ కుమార్ బెనర్జీ, శ్రావణి పాల్గొన్నారు.

ఆస్ట్రేలియన్ ప్రొఫెసర్ మార్ట్



కుట్టిన బట్టలను పరిశీలిస్తున్న ఆస్ట్రేలియన్ ప్రొఫెసర్ మార్ట్

రేపు జూడో క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - బొబ్బిలి

స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి జూడో ఆటల పోటీలకు రామభద్రపురం మండలం కొట్టక్కి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడాకారులు ఎంపిక జరుగుతుందని జూడో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బి.రత్నకిశోర్, అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా స్థాయి అండర్-14, 17 విభాగంలలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయని, పోటీలకు క్రీడాకారులు ఎంపిక ఉదయం 9గంటల నుంచి చేస్తామని చెప్పారు.

అండర్-14 పోటీలకు 2011 జనవరి ఒకటి తర్వాత పుట్టిన వారు, అండర్-17 పోటీలకు 2008 జనవరి ఒకటి తర్వాత పుట్టిన వారు అర్హులని చెప్పారు. పూర్తి వివరాలకు 9440127587 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

వినాయకుని నిమజ్జనంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకుల సీతంపేట గ్రామంలో శనివారం రాత్రి వినాయకుని నిమజ్జనం సందర్భంగా బాణసంచా కాల్పుల్లో జి. ఈశ్వరరావు, ఎర్రయ్యమ్మలకు చెందిన 12 నాటు కోళ్లు, 4 ఫ్యాన్లు, పంట పాత్రలు, గృహం నిర్మించుకోవడానికి ఏర్పాటు చేసిన టేకు కలప, 25 కేజీలు బియ్యం, ఐరన్ మంచం మంటల్లో కాలిపోయాయని విఆర్ఒ శ్రీను, మాజీ సర్పంచ్, టిడిపి నాయకుడు మంచిన అప్పలసూరి తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - బొబ్బిలి

పట్టణంలోని రెడ్డికవీధికి చెందిన జామి అప్పారావు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ టి.శ్రీహరి చెప్పారు. అప్పారావు తాగుడుకు బానిస కావడంతో ఇంటిలో ఉన్న సామాన్లు అమ్మివేసి మద్యం తాగడంతో భార్య ఆదిలక్ష్మి మందలించడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.